# సంగ్రహంగా నాలుగు వాక్యాలు

ఆ మధ్య, అంటే, 6-6-'98 ముంబయ్ టైమ్స్ ఆఫ్ ఇండియా, శనివారం అనుబంధంలో, పెరుగుతున్న జనాభా గురించి ఓ వ్యాసం ప్రచురించ బడింది. దాని స్వేచ్ఛానువాదాన్ని మీ ముందుంచడానికి ప్రయత్నిస్తున్నాను. ఎందుకంటే ఆ వ్యాస రచయిత ఎవరో కాని, జనాభా విస్తరణ గురించిన కొన్ని లెక్కల్ని చాలా చక్కగా వివరించారు.

★ ★ ★

ప్రపంచ జనాభా ప్రస్తుతం ఏటా 80 మిలియన్ల (8 కోట్లు) చొప్పున పెరుగుతోంది. 2000 సంవత్సరం నాటికి జనాభా 6 బిలియన్లకి (600 కోట్లు) పెరుగుతుందని అంచనా. రాబోయే 30 సంవత్సరాల వరకూ, ఏటా 80 మిలియన్ల చొప్పున పెరుగుతూ, 2030 సంవత్సరం నాటికి ప్రపంచ జనాభా 8.5 బిలియన్లు (850 కోట్లు) దాటుతుంది.

ఇంత ఉధృత స్థాయిలో పెరిగే, పెరిగిన జనాభా, అసలు మానవ చరిత్రలోనే అపూర్వమైన పరిణామం. ఈ విపరీతమైన జనాభా ప్రకృతి మీదా, పరిసరాల మీదా, జీవన విధానాల మీదా అనూహ్యమైన ప్రభావాన్ని చూపించి జీవరాశుల మనుగడకే సవాళ్ళు విసుర్తోంది.

సంచార జీవనానికి అలవాటుపడ్డ ఆదిమవాసులు, తిరిగి తిరిగి, చివరగా నదీ ప్రాంతాలకి వచ్చి స్థిరపడిన కాలంలో, బహుశా ప్రపంచ జనాభా 5 నుంచి 10 మిలియన్ల వరకూ, అంటే గరిష్ఠ సంఖ్యలో చెప్పుకొన్నా ఒక కోటి ఉండేది. ఆయు ప్రమాణం అప్పట్లో 25-30 సంవత్స రాలకి మించి లేదు. ఆకలీ, రోగాలూ, ప్రమాదాల వల్ల మరణించేవారి సంఖ్య, జననాల సంఖ్యతో దాదాపు సమానంగా ఉండేది.

పదీ, పన్నెండు వేల సంవత్సరాల క్రితం ఒక నిర్దిష్టమైన రూపాన్ని వ్యవసాయం సంతరించుకోవడంతో, మానవ జాతి అభివృద్ధి చెందడం ప్రారంభించింది. ఆహార సమృద్ధి వల్లా, స్థిర నివాసం వల్లా మరణాల సంఖ్య తగ్గుతూ వచ్చింది. జననాల సంఖ్య పెరుగుతూ వచ్చింది. భవిష్యత్తు బావుంటుందని అనిపించడంతో, పిల్లలు పుట్టడమనేది ఆనందదాయకంగానే పరిగణించబడింది. అయితే ఆయు ప్రమాణం మట్టుకు చెప్పుకోదగినంతగా పెరగలేదు.

ఉత్పత్తి పెరగడంతో ఆహార ధాన్యాలు పెరిగాయి. ఆ ఉత్పత్తితోబాటు జనసంఖ్య కూడా పెరిగింది. మానవుల సంఖ్య పెరగడంతో సాగు చెయ్యడానికి మరిన్ని భూములు కావల్సివచ్చాయి. ఉండడానికి మరిన్ని గ్రామాలు కావల్సి వచ్చాయి. వృక్షాలు తరుగుతూ వచ్చాయి.

గ్రామాలూ, సాగుబడి భూములూ అభివృద్ధి పొందడంతో ఉత్పత్తి మరింత హెచ్చింది. మానవులు మరింతగా అన్ని రంగాల్లోనూ ప్రగతి సాధించడం జరిగింది. ప్రగతితోబాటు జనసంఖ్య కూడా పెరుగుతూ వచ్చింది. అంచనాల మేరకు 1492 ప్రాంతంలో ప్రపంచ జనాభా అర్ధ బిలియను (50 కోట్లు). ఆ సమయంలోనే యూరోపు ప్రజలు అదనపు వనరుల కోసం కొత్త వలసల కోసం ప్రయత్నించడం జరిగింది.

జనాభా విస్తరణ ఎప్పుడూ రేఖానుక్రమబద్ధంగా ఉండేది కాదు. కరువు కాటకాలూ, యుద్ధాలూ, మహమ్మారి రోగాలూ అప్పుడప్పుడు కొన్ని కొన్ని స్థావరాల్లోని జనాలతోబాటు సంస్కృతుల్ని కూడా తుడిచిపెట్టేసేవి. అంతేకాకుండా జనాభా విస్తరణ మరో దిశలో కొత్త అంశాలని సృష్టించింది. పెరుగుతున్న జనాభా మరింత పెరగడం, సుఖజీవనం కోసం ఉన్న వనరులను అధికంగా వినియోగించుకోవడం.

జనవిస్తరణతోబాటు స్వలాభాపేక్షతో కూడిన చర్యలు కూడా విస్తరించడం మూలాన, సామాజికపరంగా చాలా క్లిష్టమైన సమస్యలుత్పన్నమయ్యాయి. ఆర్థిక వ్యవస్థ కుంటుబడడం, క్షుద్బాధలు తలెత్తడం, వలసల కోసం, వనరుల కోసం మళ్ళీ యుద్ధాలు జరగడం వీటిలో ముఖ్యమైనవి.

1780 ప్రాంతంలో యంత్ర యుగం ఆరంభమైన నాటికి ప్రపంచ జనాభా 750 మిలియన్లు (75 కోట్లు) ఉంటే, 1830 నాటికి-సరిగ్గా 50 సంవత్సరాలలో – 100 కోట్లకి పెరిగింది – (ఒక బిలియను).

యంత్ర యుగం ఆరంభం కావడంతో, గ్రామాల నుండి కార్మికులు పట్టణాలకి తరలివెళ్ళడం ప్రారంభించారు. గ్రామాలలో కూడా జనాభా పెరగడం వల్ల వంశపారంపర్యంగా వచ్చే ఆస్తిపాస్తుల విభజన జరుగుతూ, మరింత మందిని పట్టణాలకి వలస వెళ్ళేటట్టు చేసింది.

నిరుద్యోగమూ, ఆర్థిక అనిశ్చలతా, ఆహారపు కొరతా, సాగుభూముల కొరతా – ఇత్యాది కారణాల వల్ల వలస అనేది ఒక నిరంతర ప్రక్రియగా మారడంతో, దేశంలోనే పరిమితం కాకుండా, దేశాల మధ్య కూడా ముడిసరుకుల కోసం, అదనపు భూముల కోసం, వనరుల కోసం వివాదాలు తలెత్తాయి.

నిజానికి ప్రస్తుత ప్రపంచ జననాల శాతం ఇటీవలి సంవత్సరాలలో తగ్గినా, రాబోయే సంవత్సరాలలో జనాభా విస్తరణ జరుగుతోనే ఉంటుంది. ఎందుకంటే భౌతికశాస్త్ర పరమైన MOMENTUM అంటే 'గతిబలం' లాంటిది ఈ జనాభా విస్తరణ క్కూడా వర్తిస్తుంది. ప్రస్తుతం ప్రజలకి సగటుగా తక్కువ పిల్లలున్నా చాలా మందికి చాలా పిల్లలుండడంతో ప్రపంచ జనాభా పెరుగుతూనే ఉంటుంది. అదీకాక ప్రస్తుత ప్రపంచ జనాభాలో మూడో వంతు, అంటే సుమారుగా 200 కోట్ల మంది 15 సంవత్సరాలలోపువారు. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో నివసించే వీరిలో చాలామంది, సంసారాలు ప్రారంభించకా తప్పదు, జనాభా పెరగకనూ తప్పదు.

మానవ చరిత్ర ఆరంభమైన ఎన్నో లక్షల సంవత్సరాల తర్వాత, 1830 నాటికి వంద కోట్లకి జేరిన జనాభా, వంద సంవత్సరాల కాలంలో – అంటే 1930 నాటికి – రెండు వందల కోట్లకి జరిగింది. తరువాతి 100 కోట్లు పెరగడానికి 30 సంవత్సరాలూ, ఆ తర్వాతి 100 కోట్లు పెరగడానికి 15 సంవత్సరాలూ, ఆ తర్వాతి 100 కోట్లు పెరగడానికి 12 సంవత్సరాలు పట్టింది. ఈ తీరులో 2000 నాటికి 600 కోట్లు, 2042 నాటికి రెట్టింపు అంటే 1200 కోట్లకి ప్రపంచ జనాభా పెరుగుతుంది.

ఇక మన దేశం సంగతి విచారిస్తే 1991 జనాభా లెక్కల ప్రకారం మన జనాభా 845 మిలియన్లు. (సుమారు 85 కోట్లు). వాస్తవానికి మన ప్రస్తుత జనాభా వంద కోట్ల సంఖ్యని అతిక్రమించింది. జనసంఖ్య పెరగడం, స్వయంసమృద్ధి దెబ్బతినడం – దీంతో గ్రామ ప్రజలు

పట్టణాలకి వెళ్ళి జనసాగరాలు సృష్టిస్తున్నారు.

20వ శతాబ్దం ఆరంభం నాటికి మన దేశ జనాభా దాదాపు 239 మిలియన్లు అంటే 24 కోట్లు అనుకోవచ్చు. అందులో దాదాపు 10.8 శాతం మాత్రమే పట్టణాల్లో నివసించేవారు. అంటే రెండు కోట్ల అరవై లక్షల మంది. ఈ రోజు దాదాపు 25 శాతం - అంటే 25 కోట్ల మంది - నగరాల్లో నివసిస్తున్నారు. వీరిలో ఏభై శాతం అంటే 12.5 కోట్లమంది కనీసపు వసతి సదుపాయాలూ, నీటి సదుపాయాలూ లేకుండా, నిత్యకృత్యాలు కూడా లజ్జ విడిచి బహిరంగంగా నెరవేర్చుకొంటూ, అత్యంత హేయమైన జీవితం గడుపుతున్నారు. భుక్తి గడవడం వారికి ముఖ్యం.

విపరీతమైన మన దేశ జనాభాలో శక్తిమంతులైన అత్యల్ప శాతం, హద్దులు దాటిన స్వలాభాపేక్షతో, జీవన ప్రమాణాల్ని పెంచుకొనే ఉద్దేశ్యంతో, విద్యుత్తునీ, నీటినీ పరిశ్రమల కోసం పట్టణాలకి తరలిస్తూ, వన సంపదల్నీ, భూగర్భ నిక్షిప్త మైన వనరుల్నీ భక్షిస్తూ, పట్టణపు పొలిమేర్లని పెంచి సాగుభూముల్ని నాశనం చేస్తూ, ప్రకృతి పరిసరాల సమతుల్యాన్ని దెబ్బతీయడంతో గ్రామ జీవనం తీవ్రంగా దెబ్బతింది. గ్రామాల్లో జీవనాధారాలు హరించుకు పోవడంతో, నగరాల్లో మురికి వాడలు విస్తృతమవుతున్నాయి.

★ ★ ★

చెయ్యి చాచకుండా దేశం ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కాలన్నా, స్వయం సమృద్ధి సాధించాలన్నా, ఇప్పటికైనా మించిపోయింది లేదు. కుటుంబ నియంత్రణ గురించి వేరు ఆలోచనలేక, వెంటనే దేశ ప్రజలందరూ ఆచరణలో పెట్టాలి. లేదా అణ్వస్త్రాలు ఎదుటి దేశాల్ని నాశనం చేస్తే, జనాస్త్రాలు తమ దేశాల్నే నాశనం చేస్తాయి.

### ముగింపుగా మూడు ముక్కలు

జనసంఖ్య పెరుగుదల జీవన విధానాలపై, జీవన ప్రమాణాలపై ఎటువంటి ప్రభావాల్ని చూపిస్తుందో, కుటుంబ నియంత్రణ దంపతులకీ, దేశానికీ ఎందుకు అవసరమో, కొంత కథల రూపంలోనూ, కొంత వ్యాసాల రూపంలోనూ చెప్పటానికి ప్రయత్నించాను. మరీ సీరి యస్‌గా ఉంటే పక్కకి పెట్టేస్తారన్న భయం కొద్దీ కాస్త హాస్య వ్యంగ్య ధోరణిలో చెప్పడం జరిగింది కాని, ఎవరినీ కించపరిచే ఉద్దేశ్యంతో కాదు.

నిజానికి వీటిని నేను చాలాకాలంగా అప్పుడప్పుడూ వ్రాస్తూ వచ్చాను. అప్పుడప్పుడూ ఒకటీ అరాగా పత్రికల్లో పడితే గిడితే, పాఠకులు చదివి మరిచిపోతారనే ఉద్దేశ్యంతో, నా ఆలోచనలన్నీ రచనల రూపంలో ఒక్కసారిగా పాఠకుల ముందుంచడానికి చేసిన ప్రయత్నమే యిది.

చచ్చేటంత సామాజిక స్పృహతో చేసిన ఈ రచనల్ని, సామాజిక ప్రయోజనం కోసం పత్రికల వాళ్ళు ప్రచురిస్తే ప్రథమ విజయం.

పాఠకులు బుద్ధిగా చదివితే ద్వితీయ విజయం.

శ్రద్ధగా కుటుంబ నియంత్రణని ఆచరణలో పెడితే, అంతిమ విజయం నాది కాదు, దేశానిది.

– సెలవు.